కథా నిలయం
శ్రీకాకుళం

మలిన వజ్రాలు

పొద్దున నిద్రలేచినప్పటినించీ రాసిరాసి ప్రాణం విసిగి కాగితాలన్నీ షెల్ఫ్‌లో తోసేసి ఆఫీసునించి బయటపడి పార్కువైపు నడిచాడు, తాలూకాఆఫీసు యువక గుమాస్తా రామమూర్తి. అప్పుడే మసకచీకటి పడ్డది, చల్లగా వీచే పిల్లగాలులు మొద్దుబారిన అతని మనస్సుని మళ్ళీ యథాస్థితికి తేవటానికి ప్రయత్నిస్తున్నాయి. పార్కులో సిమెంటు బెంచీమీద శరీరాన్ని చేరవేసి తీరికగా, దీర్ఘంగా ఒకసారి గాలిపీల్చి, వొదిలేస్తూ తలెత్తి పక్కనకూచున్న ఒకాయన వైపు పరాకుగాచూసి, మనసుకి ఏదో స్ఫురించగా మళ్లీ అతనివైపు దృష్టి సారించి "ఏరోయ్ సుబ్బారావ్!" అన్నాడు రామమూర్తి, అతని భుజంమీద చెయ్యివేస్తూ. అతను అదరిపడి రామమూర్తివైపు తిరిగి చూసి, "ఓరి, నువ్వేనా, ఎవరో అనుకున్నాను" అన్నాడు.

"ఏం చేస్తున్నావు?"

"చూస్తూనే ఉంటివిగా, ప్రస్తుతం కూర్చునే ఉన్నాను."

"సంతోషించాలే తెలివికి, చదువుతున్నావా, ఉద్యోగం చేస్తున్నావా?"

"ఇంజనీరింగు చదువుతున్నాను. రెండో సంవత్సరం."

రామమూర్తి ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు. సుబ్బారావు ఇంత ప్రయోజకుడవుతాడని తనెన్నడూ అనుకోలేదు. స్కూల్ ఫైనల్ దాకా ప్రతి లెక్కా తన పుస్తకంలో కాపీకొట్టిన సుబ్బారావు ఈరోజు ఇంజనీరింగు కాలేజీలో చదువుతున్నాడు! రామమూర్తి నమ్మలేకపోయాడు.

"ఇంటర్మీడియేట్‌లో క్లాసు వొచ్చిందా!"

"ఉఁ హుఁ... పెద్ద రికమెండేషన్ ఉందిలే. అంచేత సులభంగానే సీటు దొరికింది."

"అదృష్టవంతుడివే."

"నువ్వేం చేస్తున్నావు?"

రామమూర్తి మనస్సు చివుక్కుమంది. ఏం చేస్తున్నాడు తను! ఏమని చెప్పుకుంటాడు! అధోముఖంగా చూస్తూ అన్నాడు.

"తాలూకాఫీసులో..."

"ఏం? చదువు మానివేశావా?"

"ఊఁ" రామమూర్తి గడిచిపోయిన రోజులు జ్ఞాపకం చేసుకుంటూ నెమ్మదిగా అన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? డబ్బులేక. లేకపోతే ఎందుకు మానేస్తాను?" కఠినంగా, విచారంగా అన్నాడు రామమూర్తి. స్కూల్ ఫైనల్‌లో హైస్కూల్ అంతటికీ ప్రథముడుగా వొచ్చాడతడు. పైకి చదవాలని ఎంతో ప్రయత్నించాడుగాని అది సాగలేదు. ఆ సంవత్సరమే అతని తండ్రికూడా చనిపోయాడు. అంచేత తప్పనిసరిగా ప్రభుత్వోద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరిన రెండో సంవత్సరమే అతనికి పెళ్ళికూడా అయింది. ఆ రోజులన్నీ అతనికి కళ్ళకి కట్టినట్టుగా కన్పిస్తున్నాయి.

"మనతో వాడెందుకు మాట్లాడతాడురా, ఉద్యోగి అయినాడాయెను." అనే మాటలు విని రామమూర్తి తలెత్తి చూశాడు. ఎదురుగా అతని క్లాస్‌మేటు విశ్వనాథం నుంచుని ఉన్నాడు. సుబ్బారావు రామమూర్తి వీపుతట్టి అన్నాడు: "విశ్వనాథం జ్ఞాపకం ఉన్నాడా?" రామమూర్తికి నవ్వొచ్చింది. ఎందుకు జ్ఞాపకం ఉండడు? తనేమైనా ఆఫీసరా ఏమిటి జ్ఞాపకం ఉండకపోవటానికి? చిరునవ్వు ముఖంమీదికి తెచ్చుకుంటూ అన్నాడు.

"ఏరా, విశ్వనాథం, ఏం చేస్తున్నావు!"

"ఎం. బి. బి. యస్. చదువుతున్నాను."

ఎం. బి. బి. యస్! కొన్నాళ్ళకి డాక్టరవుతాడన్న మాట. తన స్నేహితుల్లో పైకి చదవనివా డెవడూ లేడల్లే ఉంది. ఒకడు ఇంజనీరు, ఒకడు డాక్టరూ – మిగతావాళ్లు

ఏమేం చదువుతున్నారో! తనుమాత్రం ఎప్పటి ఎస్. ఎస్. ఎల్. సి. రామమూర్తే.

"తాలూకాఫీసులో గుమాస్తాగా చేరావుటగా?" రామమూర్తితో కలిసి చదువుకునే రోజుల్లో అతనిమీద తనకి ఏర్పడ్డ అసూయ అంతా తీర్చుకుంటూ అన్నాడు విశ్వనాథం.

రామమూర్తి ముఖం ఎర్రబడ్డది. తన పుస్తకంలో లెక్కలన్నీ మక్కీకిమక్కీ కాపీకొట్టిన వీళ్ళు ఈరోజు తన నెంత చులకనగా చూస్తున్నారు! తెలివిలోగాని, పట్టుదలలో గాని గుణంలోగాని తనకంటే వీళ్ళ ఆధిక్యత ఏమిటి? తనతో చదరంగం ఆడి ఒక్క ఆటైనా ఎప్పుడైనా గెలవ గలిగారా వీళ్లు? గంటల తరబడి బెంచీలమీద నుంచున్న వీళ్లు ఇప్పుడు ఇంజనీర్లూ, డాక్టర్లూ. తనుమాత్రం ఓ తాలుకాఫీసు గుమాస్తా! తనకంటే వీళ్లు ఒక విషయంలోమాత్రం అధికులు-డబ్బులో, ఆ ఒక్క అధిక్యతతో తనని నోరెత్తకుండా అణగగొట్టగల అవకాశం వీళ్ళకి లభించడం ఘోరం, దురన్యాయం. తనకి కూడా కాలేజీలో చదువగల అవకాశమే లభిస్తే...! ఎందుకు అనుకోటం? గాలిలోమేడల ఆకారాలు ఊహించుకుని చేసే దేముంది? ఉన్నదాంతో తృప్తిపడకతప్పదు.

"ఏమిటోయ్ మీ మాటలూ, నాకుకూడా చెప్పండి కాస్త" అన్నాడు రామమూర్తి కాసేపైనా స్నేహితులతో కులాసాగా గడుపుదామని తీర్మానించుకుని.

"హి...హి...హి...నీకేం అర్థమవుతాయి కాలేజీ గొడవలు." పళ్ళికిలించాడు విశ్వనాథం.

"హి...హి...హి..." అన్నాడు సుబ్బారావు కూడా.

ఆఫీసులో ఆఫీసర్ మీద వచ్చిన కోపాన్ని ఎలాగో దిగమింగుకుని పార్కుకివచ్చిన రామమూర్తి తనకి తన స్నేహితులవల్ల జరిగిన అవమానాన్ని సహించలేక చివాలున లేచి ఇంటికి బయలు దేరాడు, "వొస్తా" అని మాటమాత్రం అంటూ.

* * *

రామమూర్తి ఇంట్లో అడుగు పెట్టేసరికి ఇల్లంతా చీకటిగా ఉంది.

"లాంతరు వెలిగించలేదేం?" అన్నాడు అతను చిరాకుగా.

"గ్లాసు పగిలిపోయింది."

"ఎందుకు పగిలింది?"

"చేతిలోంచి జారింది."

"ఎందుకు జారింది?." కోపంతో ప్రశ్నించాడు రామమూర్తి.

"పగిలిపోయిన గ్లాసుముక్కల్ని అడగండి." జానకి నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

"చిమ్నీ వెలిగించకపోయావు అయితే?" ముఖం చిట్లించుకుని అన్నాడు రామమూర్తి.

"దాంట్లో కిరసనాయిలు లేదు."

"లేకపోతే పొయ్యాల్సింది!"

GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

"కిరసనాయిలు అయిపోయిం దింట్లో."

"ఏడ్చినట్టే ఉంది. ఆ బుడ్డీ అయినా వెలిగించు."

"నిప్పుపెట్టె లేదు."

జేబులోంచి నిప్పుపెట్టె తీసి విసురుగా ఆమెవైపు విసిరేశాడు రామమూర్తి.

"ఎవరిమీద ఆ కోపం!"

"నోరు ముయ్యి."

"అదే అనవద్దని లక్షసార్లు చెప్పాను. నే నలా మాటలు పడేదాన్ని కాను"

"ఇహ చాలించు."

"అనవసరంగా అలా కలగ చేసుకుంటా రెందుకు? ఆఫీసర్ మీద కోపం అంతా ఇంట్లో చూపిస్తే ఏం లాభం?"

"ఇక్కడినించి కాసేపు అవతలికిపో."

"అవతలికి పోవటానికి ఉన్నది ఒకటే గది."

"నాకు శాంతిలేకుండా చేస్తున్నావు ఛీ" చీదరించుకున్నాడు రామమూర్తి జానకి అతనివైపు కోపంగా, ఏవగింపుగా చూసింది. ఆమెకి అప్రయత్నంగా కళ్ళవెంబడి నీళ్లు కారాయి. ఆమె కలలోకూడా అనుకోలేదు తన జీవితం ఇలా గడుస్తుందని నాలుగేళ్ళకిందట తన ఆశలు, ఆశయాలు కఠినంగా, నిర్దాక్షిణ్యంగా తోసివేయబడ్డాయి. తనేం చదువులేనిది కాదు. పూర్తి చేయలేదు కాని ఎస్. ఎస్. ఎల్. సి దాకా చదివింది. ఆరోజుల్లో తన భావాలు, మధుర భావనలు తలచుకుని ఆమె ఆవేదన పడసాగింది. రూపం,

విద్య చక్కని ఆశయాలుగల తను కేవలం ధనవంతురాలు కానంత మాత్రాన తనతో సమానంగా చదువుకున్న అతనిని-సామాన్య గుమాస్తాని, తన ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా పెళ్లి చేసుకోవాలి సొచ్చింది. ఒక్క క్షణంలో ఆమె కోరికలన్నీ గగనకుసుమా లయాయి. కష్టాలతో. అశ్శాకలితో, భర్త చీవాట్లతో రోజులు గడపాలి సొస్తుందని తను కల్లోకూడా అనుకోలేదు. తతిమా సంగతు లేలా ఉన్నా, పోనీ భర్తయినా తనని సరిగా ఆదరిస్తే అంత బాధ ఉండకపోను. కాని ఆయ నెప్పుడూ మనసులో ఏదో పెట్టు కొని బాధ పడుతూ చిర్రు బుస్సులాడుతూ ఉంటాడు. నిజానికి పాపం. పని ఎక్కువే ఐనా అంతా అలాగే ఉంటు న్నారా ఏమిటి? ఎవరిమీదో కోపం ఇక్కడ ప్రదర్శించు కోటం ఎందుకు? అయినా మనస్సులో ఉంటుంది కాని-ప్ప ఆ మాత్రం సంస్కారం యెక్కణ్ణుంచొస్తుంది, విద్యలేకపోతే! కనీసం బి. ఏ. ప్యాసయిన వాడిని పెళ్ళి చేసుకోవాలని తను ఉబలాట పడ్డది. కాని-అయినా ఇప్పు డవన్నీ తవ్వుకుని విచారిస్తే ఏం లాభం? ఐపోయిందేదో ఐపోయింది. అనవస రంగా ఈ వెధన ఆలోచన ఏమిటి తనకి?

"అన్నం పెట్ట దల్చుకోలేదా?"

జానకి రామమూర్తి ప్రశ్నవిని ఊహా ప్రపంచం లోంచి తిరిగి వచ్చింది. అదేం అడగటం? రాజీకొచ్చిన ఆమెభావాలు మళ్లీ తిరగబడ్డాయి. యాంత్రికంగాలేచి వడ్డించింది.

"నెయ్యి?"

"లేదు, ఐపోయింది."

రామమూర్తి విసుగ్గా ఆమెవైపు చూసి నెయ్యి లేకుండానే తినటం ప్రారంభించాడు.

"ఇంకేం లేదా ?"

"లేదు."

"సరే, మజ్జిగపొయ్యి."

"లేదు."

"ఏం ?"

"పిల్లి పారబోసింది."

"నువ్వేం చేస్తున్నావు ?"

"ఒక పనైతేగా, పిల్లికి కాపలా కూర్చోటానికి."

"మరయితే ఎలా ఇప్పుడు ?"

"ఏం చేయను ?"

"ఏం చేస్తావు ? నూతిలో దూకు." మండిపడి అన్నాడు రామమూర్తి.

"గుమస్తా అధికారం ఇంట్లోనే అని బాగా రుజువు చేసుకుంటున్నారు."

"ఏమిటే, వాగుతున్నావ్ ?" ఉద్రేకంతో లేచి చేత్తో ఫెడేమని జానకి చెంపమీద బలంకొద్దీ కొట్టాడు రామమూర్తి.

ఇదివరకల్లా అభిమానమూ, హృదయమూ మాత్రమే అయితే ఈసారి శరీరం కూడా దెబ్బతిన్నది జానకికి. ఆమె

కళ్ళ వెంబడి అశ్రువులు బొటబొట కారాయి. రుద్ధకంఠంతో అంది:

"తిండి తిన్నా తినకపోయినా, తిట్లూ, దెబ్బలూ మాత్రం దండిగానే తింటున్నాను.

ఆమె నున్నటి చెంపమీద తన ఐదు వేళ్ళూ ఎర్రసిరా ముద్రలాగా పడటం ఆ గుడ్డి వెలుతురులో కూడా స్పష్టంగా చూసి "ఓరి పశువా, ఏంచేశావురా ?" అని తనని తానే స్వగతంలో ప్రశ్నించాడు రామమూర్తి.

"జానకీ." జానకి కన్నీళ్ళను అణచుకుంటూ తల పక్కకి తిప్పుకుంది.

"నిన్నే జానకీ! నెలకి అరవైఏడు రూపాయలకి ప్రభుత్వానికి అమ్ముడుపోయిన ఈ చెయ్యికి నిన్ను కొట్టటానికి అధికారం ఎవరిచ్చారో అడుగు."

జానకి పమిట చెంగుతో కళ్లు తుడుచుకుంది.

"అడగవేం, నిన్నే !" గట్టిగా అరిచాడు రామమూర్తి. జవాబు రాలేదు.

"అద్దెకి పోయిన ఈ శరీరానికి నిన్ను స్పృశించటానికి కూడా అధికారం లేదు. తిండిపెట్టే శక్తి లేకపోయినప్పుడు నీవైపు చూడటానికి కూడా అధికారం లేదు, ఈ గుమాస్తాకి. అధికారంలేని పని చేసినందుకు దీనికిదే శిక్ష."

స్టేట్‌మెంట్లు గియ్యడానికి తెచ్చుకున్న రూళ్ళ కర్రతో, అరచెయ్యి బల్లమీద పెట్టి ఫెడీమని ఉన్న బలం అంతా ఉపయోగించి చేతివేళ్ళమీద కొట్టాడు. చప్పుడు

విని జానకి తలెత్తి కమిలిపోయిన రామమూర్తి అరచెయ్యి చూసి కెవ్వన కేకేసింది. రామమూర్తి చెయ్యివైపు చూసి పిచ్చివాడిలా నవ్వాడు.

"రెండో చెయ్యి ఇహ బుద్ధిగా ఉంటుందిలే." ఆపుకున్నా ఆగని కన్నీళ్ళతో జానకి అతనివైపు చూసి గబగబ తడిగుడ్డ తెచ్చి అతని చేతికి కడుతూ కంపితస్వరంతో అంది.

"ఏమిటండీ ఇది ? మీ కేమైనా మతిపోయిందా ?"

"జానకీ, పెళ్ళి కాకముందు నన్ను చూసి నేనే జాలి పడేవాణ్ణి. ఇప్పుడు నిన్ను చూసి కూడా నేను జాలిపడాలి సొచ్చింది. ఇద్దరి ప్రాణుల నిరాశ, తీరని కోరికలు పెట్టే బాధా నాకు విశ్రాంతి లేకుండా చేశాయి. కేవలం డబ్బు లేక పోవటంచేత నా తెలివితేటలూ, జీవితం వ్యర్థమైపోతున్నాయి. అలాగే కేవలం ధనాభావంచేతే నీ కోరికలు, అందచందాల వ్యర్థమైపోయాయి. నాకు తెలుసు. నువ్వు కలలో కూడా నాలాంటివాడు నీకు భర్త అవుతాడని ఊహించుకోలేదు. నేను నీకు తగనని నాకు తెలుసు. నాలో ప్రత్యేకత ఏమీ లేదు. నేను చదివింది నువ్వూ చదివావు. నాకున్న రూపంకంటే నీకు ఎక్కువే ఉంది. అయితే మాత్రం ఏం, నీకు డబ్బులేదు. అంచేత నీకు సౌఖ్యంలేదు. నాకూ అంతే. డబ్బులేదు కనుక చదువులేదు. చదువులేదు కనుక సౌఖ్యం లేదు. ఈ రెండులేవు కనుక మనసుకి విశ్రాంతి లేదు.

"మనసుకి విశ్రాంతి లేకపోబట్టే ప్రపంచంమీద వచ్చిన కోపాన్ని మరోవిధంగా తీర్చుకునే అవకాశం లేక

పోబట్టే నీమీద అలా అప్పుడప్పుడు విరుచుకుపడడం. అంచేతే గుమాస్తా అధికారం ఇంట్లోనే అని రుజువు..."

"ఇంకెప్పుడూ అనను" అని జాలిగ అంది జానకి.

"నువ్వనే దేమిటి? నాకు తెలియదూ! నీకు తిండి పెట్టినా పెట్టకపోయినా, తిట్లు, దెబ్బలూ మాత్రం..."

"ఏమిటీ గొడవమీరింత బాధపడుతున్నారని నే ననుకోలేదు." అంది జానకి సానుభూతిగా.

"నేను పైకి చదవడం అసంభంవం. నీకు మళ్లీ పెళ్ళి కావటం అసంభవం, కనుక",

"ఛీ, ఏమిటా మాటలు." జానకి రామమూర్తి నోరు మూసింది తన కరపల్లవంతో. దగ్గరికివచ్చిన జానకి చెంప మీది ఎర్రని గుర్తుచూసి హృదయంలోని బాధను అణుస్తూ లేని నవ్వు తెచ్చుకుని అన్నాడు అతడు:

"దెబ్బకి దయ్యం పారిపోయిందా ?"

"దయ్యం పట్టింది మీకే" అంది జానకి.

కథా నిలయం
శ్రీకాకుళం